# శ్రీ కోన ప్రభాకరరావు

శ్రీ కోన ప్రభాకరరావు ఆరవ శాసనసభ (1978-1983) స్పీకరుగా 1981వ సంవత్సరం ఫిబ్రవరి 24వ తేదీన ఏకగ్రీవంగా ఎన్నికై 1981వ సంవత్సరం సెప్టెంబరు 22వ తేదీ వరకు ఆ పదవిలో కొనసాగారు. వీరి హయాంలో 1981వ సంవత్సరంలో రెండవసారి అఖిల భారత స్పీకర్ల సదస్సు హైద్రాబాదులో జరిగింది.

వీరు 1916వ సంవత్సరం జూలై 10వ తేదీన గుంటూరు జిల్లా బాపట్లలో జన్మించారు. గుంటూరులోని ఆంధ్ర క్రిస్టియన్ కాలేజీలో బి.ఎ. డిగ్రీని, తదుపరి పూనాలోని లా కాలేజీ నుండి ఎల్.ఎల్.బి. డిగ్రీని పూర్తి చేసారు. కొంత కాలం న్యాయవాదిగా పనిచేశారు.

వీరు 1967వ సంవత్సరంలో నాల్గవ శాసనసభకు, 1972వ సంవత్సరములో ఐదవ శాసనసభకు, 1978వ సంవత్సరములో ఆరవ శాసనసభకు గుంటూరు జిల్లా బాపట్ల నియోజకవర్గం నుండి ఎన్నికైనారు.

శ్రీ ప్రభాకరరావు, శ్రీ భవనం వెంకట్రామ్ మంత్రి వర్గంలో ఆర్థిక ప్రణాళిక, చిన్న మొత్తాల పొదుపు, లాటరీలు, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రిగా 28.02.1982 నుండి 20.09.1982 వరకు, శ్రీ కోట్ల విజయభాస్కర రెడ్డి మంత్రి వర్గంలో ఆర్థిక ప్రణాళికా శాఖ మంత్రిగా 20.09.1982 నుండి 09.01.1983 వరకు పనిచేసారు.

సభాపతిగా పనిచేసిన కాలంలో అత్యంత విలువైన రూలింగులు ఇచ్చారు. ప్రభుత్వం జారీ చేసిన  ఆర్డినెన్సు స్థానే శాసనసభలో బిల్లును ప్రతిపాదింపగోరే సమయంలో ఆ ఆర్డినెన్సును ఏ కారణాల వల్ల జారీ చేయవలసి వచ్చిందో తెలియజేస్తూ ఒక వివరణాత్మక పత్రాన్ని ఎటువంటి పరిస్థితులలోనైనా ఖచ్చితంగా జతచేయవలసి ఉంటుందని శ్రీ కోన ప్రభాకర రావు 1981, మార్చి 2వ తేదీన ఇచ్చిన రూలింగులో విశదీకరించారు.

వీరు పాండిచ్చేరి, సిక్కిం రాష్ట్రాల లెఫ్టినెంట్ గవర్నర్‌గా, మహారాష్ట్ర గవర్నర్‌గా పనిచేసారు.

సౌమ్యుడు, స్నేహశీలి, కళాకారుడు అయిన శ్రీ ప్రభాకరరావు 1990వ సంవత్సరం అక్టోబరు 10వ తేదీన మరణించారు.